క్లుప్తంగా

భోగి, సంక్రాంతి సంతోషంగా జరుపుకోవాలి



శింగనమల: నియోజకవర్గంలో ప్రజలందరికీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పండుగను ప్రజలందరూ సుఖ, సంతోషాలతో జరుపుకోవాలన్నారు. ప్రతి కుటుంబం ధన, ధాన్యాలతో తులతూగాలని దేవుని మనసారా కోరుకుంటున్నామన్నారు.

కమిషనర్ బాధ్యతల స్వీకరణ

గుత్తి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఇన్‌చార్జ్ కమిషనర్‌గా శరత్ చంద్ర బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న మల్లెల లక్ష్మీదేవి అహుడాకు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఏఈగా పని చేస్తున్న శరత్‌చంద్రకు ఇన్‌చార్జ్ కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించారు. ప్రజలకు అందుబాటులో ఉండి పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని నూతన కమిషనర్ పేర్కొన్నారు.

క్రీడాకారుడికి ఆర్థిక సాయం



విజయ్‌కు చెక్కు అందిస్తున్న ఫయాజ్‌బాషా

తాడిపత్రి టౌన్: స్థానిక పుట్లూరు రోడ్డులోని ఇండోర్ స్టేడియంలో శుక్రవారం పట్టణానికి చెందిన షటిల్ బ్యాడ్మింటన్ జాతీయ క్రీడాకారుడు విజయ్‌కు రూ.20 వేలు చెక్కును ఫయాజ్ సేవా ట్రస్టు చైర్మన్ హీరాపురం ఫయాజ్‌బాషా అందజేశారు. జాతీయ స్థాయి షటిల్ టోర్నీలో రాణించాలని ఫయాజ్ బాషా అతడికి సూచించారు. సీనియర్ క్రీడాకారుడు నాగేంద్ర, విశ్రాంత పీడీ శివయ్య, చవ్వా రాజశేఖర్‌రెడ్డి, అస్లాం ఉన్నారు.

బంగారు గొలుసు చోరీ

తాడిపత్రి అర్బన్: మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు చోరీ చేసిన ఘటన శుక్రవారం పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాలమేరకు.. విజయనగర్‌కాలనీకి చెందిన అంకాలమ్మ (55) శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో తన ఇంటి నుంచి సమీపంలోని దుకాణంలో సరుకులు తీసుకుని తిరిగి వస్తుండగా హెల్మెట్ ధరించి, నల్ల చొక్కా వేసుకున్న ఓ యువకుడు బైక్‌పై వచ్చి మెడలో నుంచి బంగారు గొలుసు లాగాడు. అయితే అంకాలమ్మ తన బంగారు గొలుసును గట్టిగా పట్టుకోవడంతో ఊడొచ్చిన సగం గొలుసును ఆగంతకుడు లాక్కెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎంపీజే క్యాలెండర్ విడుదల

గుంతకల్లుటౌన్: మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ కమిటీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం గుంతకల్లు ఆర్డీఓ జె.రవీంద్ర ఆవిష్కరించారు. ఎంపీజే జిల్లా అధ్యక్షుడు నజీర్ హుసేన్, ప్రధాన కార్యదర్శి హాఫీజ్ బందానవాజ్, సభ్యులు పాల్గొన్నారు.

సృజనాత్మకతకు చిహ్నాలు ముగ్గులు



రంగవల్లులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్, చైర్‌పర్సన్ భవాని, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి తదితరులు



ప్రథమ బహుమతి కింద అరుణకు ఫ్రిడ్జిని అందజేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్, చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: స్త్రీల సృజనాత్మకతకు ముగ్గులు చిహ్నాలని, సూర్యోదయానికి ముందే తెలుగింటి లోగిళ్లలో వేసే ముగ్గులు శుభసూచికలని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని అన్నారు. శుక్రవారం జగనన్న సంక్రాంతి సంబరాలు గుంతకల్లులో అంబరాన్నంటాయి. సంక్రాంతి విశిష్టతను చాటేలా హరిదాసు కీర్తనలు, బుడగజంగాల బుర్రకథలు, డూడూ బసవన్నల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, మాజీ చైర్మన్ రామలింగప్ప దంపతులు, కౌన్సిల్ సహకారంతో మెప్మా ఆధ్వర్యంలో కథలగేరి మారెమ్మ ఆలయం వద్ద నిర్వహించిన ముత్యాల ముగ్గుల ఫైనల్ పోటీలు కనువిందు చేశాయి. ఈ పోటీల్లో 113 మంది మహిళలు రమణీయంగా రంగవల్లులను తీర్చిదిద్ది కళానైపుణ్యాన్ని ప్రదర్శించారు. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సందేశాత్మక, సంస్కృతి, సంక్రాంతి విశిష్టతను చాటుతూ వేసిన ముగ్గులు ముచ్చటగొలిపాయి. వందలాది మంది పురప్రజలు ముగ్గులను తిలకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వైవీఆర్, చైర్‌పర్సన్ భవాని మాట్లాడుతూ రంగవల్లులతో అతిథులను ఆహ్వానించడం సంప్రదాయమన్నారు. సంక్రాంతి అంటేనే ముగ్గులు. ముగ్గులంటే నింగిలోని తారలు ముంగిట్లో వాలే వర్ణసమ్మేళనాలని తెలియజేశారు. ఈ పోటీల్లో మొదటి విజేతగా 11వ వార్డుకు చెందిన జి.అరుణకు ఫ్రిడ్జి, ద్వితీయస్థానంలో నిలిచిన 21వ వార్డుకు చెందిన వి.సౌమ్యకు ఎల్‌ఈడీ టీవీ, తృతీయస్థానంలో నిలిచిన 24వ వార్డుకు చెందిన వి.జ్యోతికి మిక్సర్ గ్రైండర్‌ను అందజేశారు. పోటీల్లో పాల్గొన్నవారందరికీ విలువైన చీరలను పంపిణీ చేశారు. పోటీల్లో పాల్గొన్న దివ్యాంగురాలు అశ్వినికి ఎమ్మెల్యే రూ.5 వేల నగదును అందజేశారు. న్యాయనిర్ణేతలైన 30 మందిని సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌లు నైరుతిరెడ్డి, మైమూన్, ఎంపీపీ మాధవి, మెప్మా పీడీ విజయలక్ష్మి, కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు, మెప్మా టీపీఆర్‌ఓ మోహన్, సీఎంఎం భవాని, మాజీ చైర్మన్లు రామలింగప్ప, రామాంజనేయులు, మాజీ వైస్ చైర్మన్ గోపా జగదీష్, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్‌వీఆర్.మోహన్, మెప్మా సీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు

తాడిపత్రి టౌన్: అశ్వత్థం తిరునాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆలయ పాలకవర్గానికి సూచించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం పెద్దపప్పూరు మండలం అశ్వత్థ సత్యనారాయణస్వామి తిరునాలకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈనెల 22 నుంచి వచ్చే నెల 19 వరకూ తిరునాల నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ శ్రీనివాసులరెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యం, ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరునాలకు సుదూర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు వస్తారని, వారికి అనువుగా సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం తిరునాలలో ఏర్పాట్లపై చర్చించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వేమనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

క్యాలెండర్ ఆవిష్కరణ

గుత్తి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా జీపు స్టాండ్‌లో శుక్రవారం గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు చౌదరి విజయభాస్కర్ నేతృత్వంలో ప్రైవేట్ ట్యాక్సీ డ్రైవర్ల, ఓనర్ల అసోసియేషన్ సభ్యులు నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చౌదరి విజయ భాస్కర్ మాట్లాడుతూ గుత్తి కోట ప్రాశస్త్యం, గొప్పతనాన్ని, చరిత్రను తెలియజేసే చిత్రాలు క్యాలెండర్‌లో ముద్రించామన్నారు. ట్యాక్సీ డ్రైవర్లు, ఓనర్ల అసోసియేషన్ నాయకులు జీపు రమణ, శేఖర్, బాషా, అంజి, రవి, రామచంద్ర, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నార్పల: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా నిర్మూలనాధికారి ఓబులు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు, ఓపీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయాలన్నారు. అనంతరం ఆయన పలు కాలనీల్లో పర్యటించి సీజనల్ వ్యాధులను నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ఈఓఆర్డీ లక్ష్మీనరసింహ, వైద్యాధికారులు ప్రవీణ్, పుల్లయ్య, అక్కులప్ప తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

గుత్తి రూరల్: తురకపల్లి, మాముడూరు, పి.ఎర్రగుడి, బ్రాహ్మణపల్లి, ఈశ్వరపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చిన చిన్నారుల హాజరును పరిశీలించారు. చిన్నారులతో కలిసి భోజనం రుచి చూశారు. చిన్నారులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని వండిపెట్టాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయా కేంద్రాలకు వచ్చిన చిన్నారుల, ఎత్తు, బరువులను ఆమె పరిశీలించారు. ఏఎస్‌ఎం కవిత పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్‌కు పదోన్నతి

యల్లనూరు: తహసీల్దారు కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీ నరసమ్మకు పదోన్నతి లభించింది. సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించి జిల్లా ఉన్నతాధికారులు యల్లనూరు నుంచి గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ చేశారు.

ఘనంగా మెల్విన్ జోన్స్ జయంతి

తాడిపత్రి టౌన్ : స్థానిక శ్రీనివాసపురం శివసాయి కృష్ణ ఆశ్రమంలో శుక్రవారం లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకుడు మెల్విన్ జోన్స్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. క్లబ్ సభ్యులు మెల్విన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆశ్రమ వృద్ధులకు అన్నదానం చేశారు. అనంతరం ఒక పేద వృద్ధ పండ్ల వ్యాపారికి గొడుగు వితరణ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు హరినాథరెడ్డి, రాజేశ్వరి సభ్యులు సవిత, వాణి అనురాధ, హైమావతి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే చర్యలు

గార్లదిన్నె: కోటంకలో ఉన్న ప్రభుత్వ భూమిలో ఎలాంటి తవ్వకాలు, ఆక్రమణలు చేయరాదని ఇన్‌చార్జ్ తహసీల్దార్ రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గ్రామంలో 243-1 సర్వే నంబర్‌లో రికార్డుల ప్రకారం 53.50 ఎకరాలు ప్రభుత్వ భూమి(రాళ్ల గుట్ట)గా ఉందన్నారు. ఎవరైనా భూమిని ఆక్రమించినా, అనుమతులు లేకుండా తవ్వకాలు చేపట్టినా చర్యలు తీసుకుంటామన్నారు. ఈమేరకు రాళ్ల గుట్ట వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

ఉత్తమ మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ గౌతమి

గార్లదిన్నె: స్థానిక పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ గౌతమి శుక్రవారం ఉత్తమ మెడికల్ ఆఫీసర్‌గా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్‌లో ప్రజలకు మెరుగైన సేవలు అందించినందుకు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ప్రశంసాపత్రం అందజేశారన్నారు. మండల వైద్య సిబ్బంది మెడికల్ ఆఫీసర్‌ను అభినందించారు.

ముగిసిన భజన పోటీలు



బహుమతులు అందజేస్తున్న గ్రామస్తులు

నార్పల: దుగుమర్రిలో పెద్దమ్మ తల్లి బోనాలు, పురాతన శివాలయం పున:నిర్మాణం పూర్తయిన సందర్భంగా రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి భజన పోటీలు గురువారం ముగిశాయి. పోటీల్లో 36 భజన బృందాలు పాల్గొన్నాయి. యల్లనూరు మండలం కూచివారిపల్లి బృందం మొదటి బహుమతి రూ.25,116 గెలుచుకుంది. ఇక వరుసగా వెంకటాంపల్లి, లక్షుంపల్లి, శంకరాపురం, వేల్పుమడుగు, గుర్రపాడు, నార్పల కోదండరామ బృందం విజేతలుగా నిలిచాయి. మొత్తం 19 బృందాలకు రూ.1.5 లక్షల బహుమతులు అందజేసినట్లు నిర్వాహకులు భజన పోటీల జిల్లా ఇన్‌చార్జ్ నిర్వాహకుడు బాలకృష్ణారెడ్డి తెలిపారు.

ఈ క్రాప్ నమోదు తప్పక చేయించుకోండి



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్

బుక్కరాయసముద్రం: రైతులు సాగు చేసిన పంటలను తప్పని సరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొండన్న అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ఎప్పటికప్పుడు రైతులకు చేరవేయాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వ్యవసాయ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పంటల సాగు, వాటిలో సంభవించే తెగుళ్ల నివారణపై రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు సూచలన ఇవ్వాలన్నారు. రైతులు కూడా రబీ పంటల సాగు వివరాలను ఈ క్రాపింగ్ చేయించుకోవాలన్నారు. తద్వారా ప్రభుత్వం అందించే రాయితీలు పొందేందుకు అర్హత ఉంటుందన్నారు. డ్రిప్పు పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు త్వరగా పరికరాలు అందించాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శ్రీమన్నారాయణ, మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి, మండల వ్యవసాయ అధికారి శ్యాం సుందర్‌రెడ్డి, హార్టికల్చర్ అధికారి శైలజ, వెటర్నీ డాక్టర్ పెద్దన్న, ట్రాన్స్‌కో ఏఈ ప్రతాప్, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పిన్నేశ్వరి, మైక్రో ఇరిగేషన్ అధికారి హరిత, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నార్పల: ఆర్బీకేల్లో అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉంచాలని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నాగలింగారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలలో వ్యవసాయ యంత్రీకరణ పథకం కింద యంత్ర సామాగ్రి, పురుగు, డ్రిప్పు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఏఓ ముస్తఫా మాట్లాడుతూ పీఎం కిసాన్, పంట నమోదు, ఈ-కేవైసీ, కౌలు రైతుల కోసం ఎర్పాటు చేసిన జీవన రేఖ కార్యక్రమం గురించి అవగాహన కల్పించామన్నారు. ఎంపీడీఓ దివాకర్, హెచ్‌ఓ ఫజులున్నీసా బేగం, ఎంపీటీసీ శంకర్‌యాదవ్, రైతులు పాల్గొన్నారు.

కోడి పందేలు ఆడొద్దు

యల్లనూరు: మండలవ్యాప్తంగా ఎక్కడా కోడి పందేలు ఆడకూడదని పుట్లూరు సీఐ వేణుగోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం తిమ్మంపల్లి, కొత్తపల్లి, శింగవరం తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కోడి పందేలు ఆడినట్లు రుజువైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే మట్కా, జూదంపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. కొత్తపల్లిలో నెలకొన్న రోడ్డు సమస్యను పరిశీలించారు. అనంతరం సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని స్థానికులకు సూచించారు. గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్ఐ రామకృష్ణ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

పుట్లూరు: కోడి పందేలు, పేకాట తదితర జూదాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ వెంకటప్రసాద్ శుక్రవారం పలు గ్రామాలకు చెందిన జూదరులను హెచ్చరించారు. సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వారిని తహసీల్దార్ సుమతి ఎదుట హాజరు పరచి బైండోవర్ చేశారు.

గుత్తి: సంక్రాంతి వేడుకల్లో భాగంగా ఎవరైనా కోడి పందేలు, జూదాలు ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వెంకట రామిరెడ్డి హెచ్చరించారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం జూదాలు, కోడి పందేలు పూర్తిగా నిషేధించిందన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

యోగా పోటీల్లో గుత్తి విద్యార్థిని ప్రతిభ



యోగా పోటీల్లో బంగారు పతకాలు సాధించిన ఖ్యాతిరెడ్డి, అఖిల్ సాయిరెడ్డి

గుత్తి: అనంతపురంలోని వివేకానంద యోగా కేంద్రంలో గురువారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లా యోగా పోటీలు నిర్వహించారు. పోటీల్లో గుత్తికి చెందిన ఆర్‌కే యోగా శిక్షణ కేంద్రం విద్యార్థిని ఖ్యాతిరెడ్డి ప్రతిభ కనబరిచింది. దీంతో నిర్వాహకులు ఖ్యాతిరెడ్డికి చాంపియన్స్ ఆఫ్ ది చాంపియన్స్ టైటిల్‌ను ప్రదానం చేశారు. అండర్ -14లో ఖ్యాతిరెడ్డి, అండర్ -17లో అఖిల సాయిరెడ్డి బంగారు పతకాన్ని సాధించారు. విజేతలను ఆర్‌కె యోగా శిక్షణ కేంద్రం నిర్వాహకులు రామకృష్ణారావు, కృష్ణయ్య అభినందించారు.

తొండపాడులో ఘర్షణ

గుత్తి రూరల్: తొండపాడు గ్రామంలో శుక్రవారం అన్నదమ్ముళ్ల మధ్య ఘర్షణ జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గంగాధర్, అతడి అన్న మధు మధ్య ఆస్తి విషయంలో గొడవలు ఉన్నాయి. అదే విషయంలో మరోమారు ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. కోపోద్రిక్తుడైన మధు తన కుమారుడు సాయితో కలిసి గంగాధర్‌పై కర్రలు, రాళ్లతో దాడి చేసి గాయపరిచారు. గాయపడిన గంగాధర్‌ను గుత్తి ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన అనంతపురానికి తీసుకెళ్లారు.

శింగనమల ఎస్ఐగా శ్రీనివాసులు



శింగనమల: శింగనమల ఎస్ఐగా డి.శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఆత్మకూరు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ దిలీప్ కుమార్ అనంతపురం ఎస్‌బీఐకి బదిలీ చేశారు. ఎస్ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హౌసింగ్ బిల్లులు త్వరగా చెల్లించండి

బుక్కరాయసముద్రం: జగనన్న హౌసింగ్ లబ్ధిదారులకు బిల్లులు త్వరగా చెల్లించాలని ఎంపీపీ సునీత పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక హౌసింగ్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న హౌసింగ్ బిల్లులపై ఎంపీపీ హౌసింగ్ డీఈ శ్రీమన్నారాయణను కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అందరికీ ఇళ్ల పథకం ప్రవేశ పెట్టిందన్నారు. మండలంలో ఇళ్లు కట్టువారికి త్వరగా బిల్లులు చెల్లించాలన్నారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఇప్పటి వరకు ఎన్ని గృహాలు మంజూరయ్యాయి. వాటిలో ఎన్ని పూర్తి చేశారని డీఈను అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్ ఏఈ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల పంపిణీ

తాడిపత్రి టౌన్ : స్థానిక పుట్లూర్ రోడ్డులోని ఇండోర్ స్టేడియంలో శుక్రవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సీనియర్ క్రీడాకారులు నాగేంద్ర, అస్లాం ఆధ్వర్యంలో షటిల్ టోర్నీ నిర్వహించారు. శుక్రవారం రాత్రి విజేతలకు ఫయాజ్ సేవా ట్రస్ట్ చైర్మన్ ఫయాజ్‌బాషా, విశ్రాంత ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీడీ శివయ్య బహుమతులు పంపిణీ చేశారు. అండర్-13 బాలుర సింగిల్స్‌లో అజెయ్ ప్రభాస్ విన్నర్‌గా, సాయి సందీప్ రన్నర్‌గా, అండర్-13 బాలికల విభాగంలో శిరిషా విన్నర్గా, ముస్తా ముస్కీన్ రన్నర్‌గా నిలిచారు. అండర్-17 బాలుర డబుల్స్‌లో వివేక్, గణేష్ విన్నర్స్గా, సి. రాజేష్, వి.రాజేష్ రన్నర్స్‌గా అండర్-17 బాలికల డబుల్స్‌లో అక్షయ, శిరిరెడ్డి విన్నర్స్, ఝున్సీ, షమీనా రన్నర్స్‌గా నిలిచారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

గుంతకల్లు రూరల్: పట్టణ శివారులోని చిప్పగిరి రైల్వే బ్రిడ్జి వద్ద శుక్రవారం కర్ణాటక మద్యం తరలిస్తున్న పెద్దయ్య అనే వ్యక్తిని అరెస్ట్ చేసి 96 మద్యం ప్యాకెట్లు, బైకు స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ మహేష్ కుమార్ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.

ఘనంగా గ్రామోత్సవం

తాడిపత్రి టౌన్: స్థానిక రెడ్డివారిపాలెంలోని కోదండ రంగనాథ స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి అండాల్ అమ్మవారి గ్రామోత్సవం ఘనంగా జరిగింది. ధనుర్మాస పూజల్లో భాగంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రెడ్డివారిపాలెం, సీబీరోడ్డులో ఊరేగించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

గుంతకల్లు రూరల్: గుంతకల్లు రైల్వేస్టేషన్ బుకింగ్ కార్యాలయం ఎదురుగా ఉన్న ట్రైన్స్ లిస్ట్ వద్ద శుక్రవారం గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్ఐ రమణ తెలిపారు. వృద్ధుడు ఎంతకి అక్కడ నుంచి కదలకపోవడంతో అనుమానంతో అక్కడున్నవారు పరిశీలించి మృతి చెందినట్లుగా ధ్రువీకరించుకొని రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. జీఆర్పీ ఎస్ఐ రమణ విచారణ చేపట్టారు. మృతుడి వయసు 60కి పైగానే ఉండొచ్చని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సెల్: 9440627667, 9440996164 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.

వేతనాలివ్వాలి

గుంతకల్లుటౌన్: స్వచ్ఛ భారత్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 10 నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో కార్మికులతో సమస్యలపై చర్చించారు.





సంక్రాంతి సందడి

పట్టణంలో శుక్రవారం సంక్రాంతి పండుగ నెలకొంది. శనివారం నుంచి సోమవారం వరకు మూడు రోజుల పాటు సంక్రాంతి సంబరాలు జరగనున్నాయి. దూర ప్రాంతాల నుంచి పండుగకు బంధువులు, కుటుంబ సభ్యులు తరలివస్తున్నారు. కొత్త కూరగాయల మార్కెట్, గాంధీసర్కిల్‌తోపాటు అంగళ్ల వద్ద సందడి నెలకొంది. పండుగకు సంబంధించి పూలు, గుమ్మడికాయలు, ముగ్గుల పొడులు, గ్రీటింగ్స్, గాలిపటాలు, నిత్యావసర వస్తువులు కొనేందుకు జనాలు తరలి రావడంతో పట్టణ వీధులు రద్దీగా మారాయి.

తాడిపత్రి టౌన్

ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పేలా చూడాలి



నూతనంగా ఎన్నికైన వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, కమిటీ సభ్యులు మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేయాలి. ఆరుగాలం శ్రమించే రైతన్నకు అండగా నిలవాలి. పండించిన పంటను అమ్ముకునేలా సరైన సౌకర్యాలు కల్పించాలి. నిరుద్యోగ యువతకు బ్యాంకు రుణాలను ఇప్పించి ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలి.

– తలారి రంగయ్య, అనంతపురం ఎంపీ

రైతు పక్షపాత ప్రభుత్వం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు పక్షపాతిరు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రైతు శ్రేయస్సు కోసం కృషి చేస్తున్నారు. ఆయన ఆశయాలకు తగ్గట్లు సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయి. రైతులకు నీటి కష్టాలు కూడా లేకుండా పోయాయి. ప్రజా సంక్షేమమే పరమావధిగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర ప్రజలు గుర్తించుకోవాలి.

గోరంట్ల మాధవ్, హిందూపురం ఎంపీ

బడుగుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



ప్రమాణ స్వీకారోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు రూరల్: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి, ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డులో నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎస్వీఆర్ మోహన్, వైస్ చైర్మన్‌గా పాండురంగారెడ్డి డైరెక్టర్లతో కలిసి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే, ఎంపీలతోపాటు జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ హాజరయ్యారు. ఈసందర్భంగా వారు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లను అభినందించారు. రైతు సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, మార్కెట్‌యార్డు అభివృద్ధే ధ్యేయంగా కృషి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతు శ్రేయస్సే పాలన సాగిస్తున్నారన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు మహిళల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. రైతు సమస్యల పరిష్కారం కోసం ప్రతి గ్రామంలోనూ ఆర్బీకే ఏర్పాటు చేశారన్నారు. విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు, డ్రిప్ పరికరాలు అందజేస్తూ రైతులు పండించిన పంటను సైతం ఆర్బీకేలోనే విక్రయించేలా ఏర్పాటు చేశారన్నారు. గుంతకల్లు నియోజకవర్గంలోనే 80 శాతం పదవులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు కట్టబెట్టారన్నారు. జగన్ పాలనలో రాష్ట్ర ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారని, ఆవిషయం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. . చంద్రబాబు అండ్‌కో చేస్తున్న దుష్ప్రచారాలను ప్రజలు ఎన్నటికీ నమ్మరన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు మరోసారి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నాన్నారు. రిటైర్డ్ జిల్లా జడ్జి కిష్టప్ప, కురుబ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజహంస శ్రీనివాసులు, మార్కెట్ యార్డు సెక్రటరీ రూప్ కుమార్, మున్సిపల్ చైర్మన్ ఎన్ భవాని, ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ కదిరప్ప, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్లు నక్కా భీమలింగప్ప, దేవేంద్రప్ప, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాదిలింగేశ్వరబాబు, సీనియర్ నేత సుధాకర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ జింకల రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ సుంకప్ప, మండల కన్వీనర్ మోహన్‌రావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.